సాక్షి రంగారెడ్డి

శనివారం । 29 । మార్చి । 2025




అద్దె భవనాలు..

జిల్లాలో గురుకులాలకు సొంత గూళ్లు కరువయ్యాయి. అరకొర వసతుల నడుమ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. 10లో▸



పెండింగ్ బిల్లులు చెల్లించండి

బకాయిలను వెంటనే చెల్లించాలని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. 10లో▸



న్యూస్‌రీల్

రాజీవ్ యువ వికాసం .. దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన్, పార్శి) వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ప్రకటించిందని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో అర్హత, ఆసక్తి గల వారు ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు మించకూడదన్నారు. వ్యవసాయేతర పథకాలకు 21–55 సంవత్సరాలు వయోపరిమితి, వ్యవసాయ అనుబంధ రంగాలకు 21–60 సంవత్సరాలు దాటకూడదన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదారు పాసుబుక్కులు, దివ్యాంగులైతే సదరం సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో సమర్పించాలని సూచించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు



కొందుర్గు ఠాణాలో సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ రంగస్వామి

కొందుర్గు: విధి నిర్వహణలో నిర్లక్ష్యం సహించేది లేదని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి హెచ్చరించారు. కొందుర్గు పోలీసు స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పెట్రోలింగ్ సిబ్బంది డయల్ 100కు కాల్స్ రాగానే జాప్యం లేకుండా ఘటనా స్థలానికి చేరుకోవాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చిన బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య పాల్గొన్నారు.

పన్ను వసూలు చేయని కార్యదర్శులపై చర్యలు



మోకిలలో డీపీఓ సమక్షంలో ఎంపీడీఓకు పన్ను కడుతున్న వ్యక్తి

శంకర్‌పల్లి: గ్రామాల్లో సక్రమంగా పన్ను వసూలు చేయని పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోనున్నట్లు డీపీఓ సురేశ్ మోహన్ హెచ్చరించారు. మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన పన్ను వసూలు లక్ష్యం, వసూలు చేసిన వివరాలను ఎంపీడీఓ వెంకయ్యను అడిగి తెలుసుకున్నారు. మోకిలలోని లా పలోమా విల్లాలను పరిశీలించి పన్ను ఎందుకు కట్టట్లేదు అనే విషయాలపై కమిటీ వాళ్లతో చర్చించారు. అనంతరం డీపీఓ మాట్లాడుతూ.. ప్రజలందరూ పన్ను కట్టి అధికారులకు సహకరించాలని కోరారు. ఈ రెండు రోజుల్లో పన్ను కట్టకపోతే జప్తు నోటీసులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో రోజువారీ చెత్త సేకరణ, నర్సరీల సంరక్షణ బాధ్యతను సరిగ్గా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ గిరిరాజు, మోకిల సెక్రెటరీ ఎల్లయ్య పాల్గొన్నారు.

న్యాయవాది ఇజ్రాయిల్ కుటుంబానికి పరామర్శ



నివాళి అర్పిస్తున్న సబితారెడ్డి తదితరులు

మహేశ్వరం: హత్యకు గురైన న్యాయవాది ఇజ్రాయిల్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి తుమ్మలూరులోని ఆయన నివాసంలో శుక్రవారం పరామర్శించారు. ఇజ్రాయిల్ చిత్రపటానికి పూమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇజ్రాయేల్ పేదల పక్షాన నిలబడి పోరాడే వారని గుర్తు చేశారు. దళితులు, గిరిజనులు, బీసీల సమస్యలు తమ దృష్టికి తెచ్చేవారని అన్నారు. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. అంతకు ముందు ఇజ్రాయిల్ భార్య, కూతుళ్ల, సోదరులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు అడ్డగోలు!



బడంగ్‌పేట్‌లో బయటపడుతున్న టౌన్‌ప్లానింగ్ లీలలు

- కోర్టు కేసులున్నా.. లింకు డాక్యుమెంట్లు లేకున్నా ప్లాట్లకు పర్మిషన్లు
- అనుమతులు రద్దు చేయాలంటూ బాధితులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: సాధారణంగా ఎవరైనా ఇంటి నిర్మాణం కోసం టీఎస్‌బీపాస్ ద్వారా మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగానికి దరఖాస్తు చేసుకుంటే.. సంబంధిత విభాగం అధికారులు లీగల్‌గా ఎలాంటి వివాదాలు లేవని, అన్ని డాక్యుమెంట్లు పక్కాగా ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే అనుమతులు ఇస్తుంటారు. కానీ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మాత్రం ఇవేవీ పట్టించుకోవడం లేదు. అడిగినంత ఇస్తే చాలు కళ్లు మూసుకుని ఫైళ్లపై సంతకాలు పెట్టేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పాత వెంచర్లలోని పార్కులు, ఖాళీ స్థలాలకు అడ్డగోలుగా అనుమతులు జారీ చేస్తున్నారు. ఇప్పటికే కబ్జాకు గురైన ఓ పార్కు స్థలంలో నిర్మాణాలకు అనుమతులిచ్చి అపవాదు మూటగట్టుకున్న మున్సిపాలిటీ అధికారులు.. తాజాగా ఏ లింకు డాక్యుమెంట్లు లేని, కోర్టు వివాదంలో ఉన్న పాత జీపీఏ లేఅవుట్‌లో పలు నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం చర్చనీయాంశగా మారింది. ఈ అంశంపై వివరణ కోరేందుకు 'సాక్షి' మున్సిపల్ కమిషనర్ సరస్వతిని ఫోన్‌లో సంప్రదించగా, ఆమె స్పందించకపోవడం విశేషం.

అల్మాస్‌గూడలో ఇష్టారాజ్యం

అల్మాస్‌గూడ పరిధిలోని సర్వే నంబర్ 129, 130, 131, 132లోని 42.27 ఎకరాల భూమిలో 40 ఏళ్ల క్రితమే సి.సుభాన్‌రెడ్డి పంచాయతీ లే అవుట్ చేశారు. భూ యజమానులంతా కలిసి సుభాన్‌రెడ్డికి సేల్‌డీడ్ జీపీఏ ఇచ్చారు. ఆయన 1982–90 మధ్య కాలంలోనే దాదాపు ప్లాట్లన్నీ విక్రయించారు. ఇప్పటికే మెజార్టీ కొనుగోలుదారులు నిర్మాణాలు సైతం చేపట్టారు. ఇప్పటి వరకు అమ్ముడుపోకుండా ఖాళీగా ఉన్న ప్లాట్లకు తామే అసలైన వారసులమంటూ ఓ కుటుంబం తెరపైకి వచ్చింది. రిజిస్ట్రేషన్లశాఖ ఆన్‌లైన్ ఈసీల్లో కూడా ఈ ప్లాట్ల వివరాలు కన్పించకపోవడం అవకాశవాదులకు కలిసి వచ్చింది. రిజిస్ట్రేషన్లశాఖ, మున్సిపల్‌శాఖ అధికారులను మేనేజ్ చేసి, ఖాళీ ప్లాట్లను తమ పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ ప్లాట్లపై కోర్టులో వివాదం నడుస్తుండగా తుది తీర్పు ఇంకా వెలువడలేదు. లింకు డాక్యుమెంట్లు లేని, కోర్టు వివాదంలో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు నిర్మాణ అనుమతులు ఎలా ఇచ్చారనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. ఇప్పటికే ఆ లేఅవుట్‌లోని ప్లాట్ నంబర్ 180 సహా 259లో జీ+1 అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. అంతే కాదు మంజూరు చేసిన అనుమతులను రద్దు చేయాల్సిందిగా కోరుతూ లే అవుట్ డెవలపర్ సుభాన్‌రెడ్డి ఇటీవల మున్సిపల్ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

పాత వెంచర్లలోని ఖాళీ స్థలాలు మాయం

31వ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 743, 746, 747, 748, 749, 750లో సుమారు యాభై ఎకరాల్లో ఏళ్ల క్రితమే పంచాయతీ లే అవుట్ వేశారు. దీనిలో 5,100 గజాలు పార్కులు, ఇతర ప్రజావసరాలకు వదిలారు. పార్కు స్థలాలను నాటి గ్రామ పంచాయతీ పేరున గిఫ్ట్‌డీడ్ చేయలేదు. సదరు భూమి నాలా కన్వర్షన్ కూడా కాలేదు. దీంతో ఇప్పటికీ పాత యజమానుల పేర్లే కన్పిస్తుండటం, పాత లే ఔట్‌లో ప్లాట్ల సంఖ్య క్రమ పద్ధతిలో లేకపోవడం అక్రమార్కులకు కలిసి వచ్చింది. పక్కనే ఉన్న పట్టా భూముల సర్వే నంబర్, పాసు బుక్ నంబర్లు వేసి 5,100 గజాల ఖాళీ స్థలంలో 23 ప్లాట్లు చేసి గుట్టుగా విక్రయించారు. నాలా కన్వర్షన్ చేయకుండా, కొత్తగా వెంచర్ ఏర్పాటు చేయకుండా పాత వెంచర్‌లోని ఖాళీ స్థలాలకు 2023 ఆగస్టు 11న చంపాపేట ఎస్ఆర్ఓ రిజిస్ట్రేషన్లు చేశారు. రిజిస్ట్రేషన్‌కు ముందే టీఎస్ బీపాస్ ద్వారా ఒకే రోజులో నిర్మాణాలకు అనుమతులు జారీ చేయడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సీపీఎం నేతల అరెస్టులపై నిరసన



మహేశ్వరంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

మహేశ్వరం: ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములను ఆక్రమించిన రామోజీ ఫిలింసిటీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల శేఖర్ డిమాండ్ చేశారు. ఫిలింసిటీలో పేదల భూములను స్వాధీనం చేసుకోవడానికి వెళ్లిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ఇతర నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం మండలంలోని రాయపోల్, పోల్కంపల్లి, నాగన్‌పల్లి, ఎండ్లగూడ, ముక్కునూరు గ్రామాలకు చెందిన పేదలకు 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పట్టాలను పంపిణీ చేశారని తెలిపారు. పట్టాలు ఇచ్చినప్పటి నుంచి పేదలను భూమిలోకి వెళ్లనీయకుండా ఫిలింసిటీ యాజమాన్యం అడ్డుకుంటోందని ఆరోపించారు. పేదలకు ఇచ్చిన స్థలాలను స్వాధీనం చేసుకోవడానికి వెళ్లిన నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం ఫిలింసిటీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు రవికుమార్ పాల్గొన్నారు.

పన్నులు తగ్గించేదాకా పోరాటం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి



రిలే దీక్షలో మాట్లాడుతున్న రాణి రుద్రమదేవి

మీర్‌పేట: మార్పు తెస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటి పన్నులు పెంచి పేద, మధ్యతరగతి ప్రజలను దోచుకుంటోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి ఆరోపించారు. మీర్‌పేటలో ఇంటి పన్నులు తగ్గించాలని బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన ఆమె మాట్లాడుతూ.. మీర్‌పేట ప్రాంతంలో అధిక పన్నులతో ప్రజలు ఇంత ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే, ముఖ్యమంత్రికి పట్టింపే లేదని విమర్శించారు. అమాయక ప్రజలపై పన్నుల భారం మోపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అదే పాతబస్తీలో ఇంటింటికీ తిరిగి పన్నులు వసూలు చేసే దమ్ముందా అని ఆమె ప్రశ్నించారు. పన్నులు తగ్గించే వరకు కొట్లాడతామని ఆమె స్పష్టం చేశారు. దీక్షలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గంగాపురం వెంకట్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, మీర్‌పేట అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేష్ ముదిరాజ్, నాయకులు గుర్రం మల్లారెడ్డి, పెండ్యాల నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డి, సోమేశ్వర్, గాజుల మధు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఆరుట్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నోములలో పాల సేకరణ కేంద్రం, ఆరుట్లలో మినీ మార్కెట్ నిర్మాణం పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. మంచాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో నోములలో రూ.20లక్షలతో పాల సేకరణ కేంద్రం ఏర్పాటుకు పునాది వేశామన్నారు. అలాగే ఆరుట్లలో రూ.60లక్షలతో మినీ మార్కెట్ నిర్మాణానికి భూమి పూజ చేయడం సంతోషకరం అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు చేసి చూపిస్తామన్నారు. అనంతరం పలువురు ముస్లిం నేతలు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించారు. వివిధ సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఇన్‌చార్జి కార్యదర్శి రమేష్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు ఎల్లేష్, పాండునాయక్, నాయకులు ఈసీ శేఖర్ గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

భూ కబ్జా కేసులో జీవన్‌రెడ్డి విచారణ

- మోకిల పీఎస్‌లో నాలుగు గంటల పాటు ప్రశ్నించిన పోలీసులు
- ఆచితూచి సమాధానాలు చెప్పిన ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే
- తనపై అక్రమ కేసు బనాయించారని ఆరోపణ
- విచారణకు సహకరిస్తానని వెల్లడి



మోకిల పీఎస్‌లో విచారణకు హాజరై వెళ్తున్న ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

శంకర్‌పల్లి: భూ కబ్జా ఆరోపణలపై ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి శుక్రవారం మోకిల పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. శంకర్‌పల్లి మండలం టంగటూర్‌లో ఆయన భూ కబ్జాలకు పాల్పడ్డారని సామ దామోదర్‌రెడ్డి అనే వ్యక్తి 2024 మే 27న మోకిల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో జీవన్‌రెడ్డితో పాటు ఆయన భార్య రజిత, తల్లి రాజుబాయిపై సైతం కేసు నమోదు కాగా.. వారికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. జీవన్‌రెడ్డికి బెయిల్ రాకపోవడంతో తనను అరెస్టు చేయొద్దంటూ సుప్రీం కోర్టుకు వెళ్లారు. దీంతో కోర్టు జీవన్‌రెడ్డిని అరెస్టు చేయొద్దని, విచారించాలని ఆదేశించింది. ఈ కాపీతో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆయన మోకిల ఠాణాకు చేరుకున్నారు. నార్సింగి ఏసీపీ రమణగౌడ్ ఆధ్వర్యంలో సీఐ వీరబాబు జీవన్‌రెడ్డిని విచారించారు. టంగటూర్‌లో భూమి ఎలా కొన్నారు? ఎందుకు కొన్నారు? ఎంత కొన్నారు? ఏఏ సంవత్సరంలో కొన్నారు? తదితర విషయాలపై ప్రశ్నలవర్షం కురిపించారు. సుమారు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా విచారించారు. దీనికి జీవన్‌రెడ్డి ఆచితూచి సమాధానం ఇచ్చారు. అవసరమైతే మళ్లీ పిలుస్తామని, అందుబాటులో ఉండాలని పోలీసులు ఆయనకు సూచించారు.

పొలిటికల్ డ్రామా..

విచారణ అనంతరం యటకు వచ్చిన జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తాను టంగటూర్‌లో భూ కబ్జాలకు పాల్పడ్డాననేది కేవలం పొలిటికల్ డ్రామా అని కొట్టిపారేశారు. కబ్జాలకు పాల్పడడం కాంగ్రెసోళ్లకు అలవాటని, తమకు లేదని వ్యాఖ్యానించారు. ఓ వర్గం మీడియా ఉద్దేశపూర్వకంగా అసత్యాలను ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై అక్రమంగా కేసు నమోదు చేశారని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మోకిల పీఎస్‌లో విచారణకు హాజరయ్యానని స్పష్టం చేశారు. ఎన్ని సార్లయినా రావడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.



పోటీల్లో క్రీడాకారుల విన్యాసం



పోటీల ప్రారంభోత్సవంలో పొన్నం, ప్రసాద్‌కుమార్, మహేష్‌కుమార్ గౌడ్

క్రీడలకు మరింత ప్రోత్సాహం

- బడ్జెట్‌లో రూ.465 కోట్లు కేటాయింపు
- మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్
- 2027లో నగరంలో ఆసియా కరాటే చాంపియన్‌షిప్: పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

గచ్చిబౌలి: క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 4వ కరాటే నేషనల్ పోటీల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో క్రీడల కోసం రూ.465 కోట్లు తమ ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. పదేళ్ల క్రీడలను నిర్వీర్యం చేశారని, సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. 2027లో హైదరాబాద్‌లో ఆసియా కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. సెవెన్త్ డాన్ బ్లాక్ బెల్ట్ సాధించిన తాను ఇప్పటికీ కరాటే సాధన చేస్తున్నట్లు ఆయన వివరించారు. కాగా.. 1,500 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, వైస్ చైర్మన్, ఎండీ సోనీ బాల, భారత క్రికెట్ మాజీ కెప్టెన్ అజహరుద్దీన్, బాక్సర్ నిఖత్ జరీన్, ఇండియన్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు భరత్ శర్మ, ప్రధాన కార్యదర్శి సంజీవ్ కుమార్, ఓబీసీ డెవలప్‌మెంట్ చైర్మన్ జెరిపాటి జైపాల్, కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాలు లేని భూములను టీజీఐఐసీకి అప్పగించాలి



అధికారులతో సమావేశమైన ఆర్డీఓలు

కందుకూరు: ఫార్మాసిటీ కోసం గతంలో సేకరించి పరిహారం చెల్లించిన.. ఎలాంటి వివాదాలు లేని భూములను టీజీఐఐసీకి అప్పగించాలని కందుకూరు, ఇబ్రహీంపట్నం ఆర్డీఓలు జగదీశ్వర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ, టీజీఐఐసీ, పోలీస్ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో కందుకూరు, కడ్తాల్, యాచారం మండలాల్లో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల చుట్టూ హద్దులు గుర్తించాలని చెప్పారు. అవార్డు పాస్ అయి పరిహారం ఇచ్చిన భూములకు మాత్రమే అన్నారు. కోర్టు వివాదాలు, పరిహారం చెల్లించని భూముల జోలికి వెళ్లొద్దన్నారు. వివాదాలు లేని భూములను టీజీఐఐసీకి అప్పగించాలన్నారు. వారు చుట్టూ రక్షణ ఏర్పాట్లు చేసుకుంటారన్నారు. ఆ దిశగా అధికారులు వెంటనే పనులు ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం, ఇబ్రహీంపట్నం ఏసీపీలు లక్ష్మీకాంత్‌రెడ్డి, రాజు, తహసీల్దార్ గోపాల్, సీఐలు సీతారామ్, కృష్ణంరాజు, జగదీష్, నందీశ్వర్, ఆర్ఐలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్



మాట్లాడుతున్న శ్రీనునాయక్

షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్ అన్నారు. గోర్‌బోలీ భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన సందర్భంగా శుక్రవారం షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీశ్రేణులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం శ్రీనునాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి గిరిజనులపై ఎనలేని చిత్తశుద్ధి ఉందన్నారు. అందులో భాగంగా గోర్‌బోలీ భాషను రాజ్యాంగంలో చేర్చాలని తీర్మానం చేసిందన్నారు. దేశంలో హిందీ తర్వాత అత్యధికంగా గోర్‌బోలీ మాట్లాడుతున్నారని చెప్పారు. లిపిలేని భాషను అధికారికంగా గుర్తించాలని ఎంతో కాలంగా గిరిజనులు బెల్లయ్య నాయక్ నేతృత్వంలో పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు రఘునాయక్, శుక్రునాయక్, బాలునాయక్, మోహన్‌నాయక్, వేణునాయక్, ప్రేమ్‌నాయక్, గణేష్‌నాయక్, సుమన్‌నాయక్, సంతోష్, శంకర్‌నాయక్, వినోద్, సూర్యనాయక్, మల్లేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న షీటీం హెడ్‌కానిస్టేబుల్ బిచ్చయ్య

షాద్‌నగర్: మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని షీటీం హెడ్‌కానిస్టేబుల్ బిచ్చయ్య అన్నారు. పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం నగేష్ ఆధ్వర్యంలో షీటీం సహకారంతో శుక్రవారం మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం, సైబర్ నేరాలపై వీఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిచ్చయ్య మాట్లాడుతూ.. కొత్త వ్యక్తులతో మాట్లాడకూడదని, అపరిచితులు, అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 1930, 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని అన్నారు. అమ్మాయిలు ఫోన్‌లో పరిచయం అయిన వారిని నమ్మకూడదని సూచించారు. ఫోన్, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో అపరిచితులు పరిచయం చేసుకుంటారని, ఆ పరిచయాన్ని ఆసరాగా చేసుకొని మోసం చేస్తారని తెలిపారు. అపరిచితుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. నేరాలను అరికట్టేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో షీ టీం సిబ్బంది భార్గవి, కృష్ణయ్య, సురేష్‌కుమార్, వెంకటేశ్, గ్రామసంఘం అధ్యక్షురాలు, వీఓఏలు, సీసీలు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

నందిగామ: గుర్తు తెలియని రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన నందిగామలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్ కథనం ప్రకారం.. నందిగామకు చెందిన చెన్నగళ్ల నరేశ్(30) శుక్రవారం తెల్లవారుజామున స్థానిక రైల్వే బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్ నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. షాద్‌నగర్ రైల్వే స్టేషన్ మాస్టర్ అబ్దేషయాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

యాచారం: కుటుంబంలో తలెత్తిన ఘర్షణతో ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన మండలంలో చేటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. యాచారం గ్రామానికి చెందిన పిల్లి రవి(35), అతని భార్య లావణ్యకు కుటుంబ పోషణ విషయంలో ఘర్షణ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన రవి ఈ నెల 8న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల వద్ద వెతికినా జాడ కనిపించలేదు. దీంతో అతని భార్య శుక్రవారం యాచారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు

సిటీ కోర్టులు: ఓటుకు నోటు కేసు విచారణ శుక్రవారం నాంపల్లిలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో జరిగింది. ఈ విచారణకు సీఎం రేవంత్ రెడ్డి, సెబాస్టియన్, వేం కృష్ణ కీర్తన్, ఉదయ్ సింహా, సండ్ర వెంకట వీరయ్య గైర్హాజరయ్యారు. జెరూసలేం మత్తయ్య హాజరయ్యారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు నిందితులను ఎగ్జామినేషన్ చేయాల్సి ఉందని, వచ్చే విచారణకు అందరూ హాజరు కావాలని సూచిస్తూ..ఏప్రిల్ 28కి వాయిదా వేసింది.

అద్దె భవనాలు.. అరకొర వసతులు



చేవెళ్లలో అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ గురుకుల పాఠశాల

విద్య లేని వాడు వింత పశువంటారు. అంతటి ప్రాధాన్యం ఉన్న విద్యను పేద విద్యార్థులకు చేరువ చేసేందుకు గురుకులాలు చక్కటి సాధనంగా దోహదపడతాయి. ప్రస్తుతం జిల్లాలో అరకొర వసతుల నడుమ గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

- జిల్లాలో గురుకుల పాఠశాలల తీరిది
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

చేవెళ్ల: విద్యాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్న ప్రభుత్వ యంత్రాంగం మాటలు నీటి మీద రాతలుగా మారాయి. నియోజకవర్గాల వారీగా మంజూరైన గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. వీటి ఏర్పాటులో ప్రభుత్వాల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. చేవెళ్ల నియోజకవర్గానికి సంబంధించి ఎస్సీ, బీసీ, మైనార్టీ బాలికల, బాలుర గురుకుల పాఠశాలలకు సొంత భవనం లేకపోవటం విడ్డూరంగా మారింది. జిల్లాలో సైతం అన్ని చోట్ల గురుకులాలు ఉన్నా సొంత భవనాలు లేవు. వచ్చే విద్యా సంవత్సరానికైనా గురుకుల పాఠశాలలకు భవనాలు ఆయా నియోజకవర్గాల పరిధిలోనే మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.3 లక్షల నుంచి 4 లక్షల అద్దె

రాష్ట్రంలో నియోజకవర్గాల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పేరుతో ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటు చేసింది. వీటికి సొంత భవనాలు ఆయా జిల్లాల్లో లేక ఇతర ప్రాంతాలకు తరలించారు. రంగారెడ్డి జిల్లాతోపాటు వికారాబాద్ జిల్లాలకు చెందిన దాదాపు 10కిపైగా గురుకుల పాఠశాలలు చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్ మండలాల్లోనే కొనసాగుతున్నాయి. చేవెళ్ల డివిజన్‌లో గతంలో ఎక్కువగా కొనసాగిన ఇంజనీరింగ్ కళాశాలల భవనాలు ఖాళీగా ఉండటంతో వాటిలో గురుకులాలను ఏర్పాటు చేశారు. ఒక్కో గురుకుల పాఠశాలకు రూ.3 నుంచి 4లక్షల అద్దె చెల్లిస్తున్నారు. పాఠశాలలకు సొంత భవనాలే కాదు అద్దెభవనాలు కూడా లేకపోవటంతో పక్క జిల్లాలో కొనసాగిస్తున్నారు.

రవాణా ఖర్చుల భారం

చేవెళ్ల డివిజన్‌లో నియోజకవార్గానికి చెందిన వాటితోపాటు వికారాబాద్ జిల్లా బురాన్‌పూర్, పెద్దేముల్, కొడంగల్, శేరిలింగంపల్లి గురుకుల పాఠశాలలు అద్దె పైనే కొనసాగుతున్నాయి. వీటిలో పేద పిల్లలే చదువుతుంటారు. వారికి చూడడానికి తల్లిదండ్రులు నెలకోసారి వస్తుంటారు. దీంతో అధిక రవాణా ఖర్చులు భరించలేక పోతున్నామని వాపోతున్నారు. ఆయా జిల్లాలోని గురుకులాలు అక్కడే కొనసాగేలా చూడాలని కోరుతున్నారు. మరోవైపు వసతుల కల్పన కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది.

భవనాల నిర్మాణానికి కృషి



నియోజకవర్గంలోని అన్ని వర్గాల విద్యార్థులకు గురుకుల పాఠశాలలు మంజూరయ్యాయి. అవన్నీ ప్రస్తుతం ఇక్కడే కొనసాగుతున్నాయి. వీటికి సొంత భవనాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో మాట్లాడి కృషి చేస్తాను. గురుకుల పాఠశాలలతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు మంజూరయింది. త్వరలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

– కాలె యాదయ్య, ఎమ్మెల్యే, చేవెళ్ల

పెండింగ్ బిల్లులు చెల్లించండి



సీఎంకు పోస్టుకార్డులు పంపుతున్న మాజీ సర్పంచ్‌లు

సీఎంకు పోస్టు కార్డులు పంపిన మాజీ సర్పంచ్‌లు

కడ్తాల్: ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్‌లు పోస్టు కార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన మాజీ సర్పంచ్‌లతో కలిసి పోస్టాఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్ కార్డులు పంపారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు ఎన్ని నిరసనలు వ్యక్తం చేసినా, కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. పెండింగ్ బిల్లులు అందక మాజీ సర్పంచ్‌ల కుటుంబాలు అనేక ఇబ్బందులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరి వీడి, మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, మాజీ సర్పంచ్‌లు తులసీరాం, యాదయ్య, భాగ్యమ్మ, లోకేశ్, హరిచంద్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

స్టేటస్‌కో ఉత్తర్వులను సమీక్షించలేం

బతుకమ్మ కుంటపై హైడ్రాకు హైకోర్టు స్పష్టం

సాక్షి, హైదరాబాద్: నగరంలోని అంబర్‌పేట్‌లో ఉన్న బతుకమ్మ కుంట పునరుద్ధరణపై గతంలో ఇచ్చిన స్టేటస్‌కో ఉత్తర్వులపై ఎలాంటి పునః సమీక్ష చేయలేమని హైడ్రాకు హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్ (ఐఏ)ను కొట్టివేసింది. అంబర్‌పేట మండలం బాగ్ అంబర్‌పేట సర్వే నంబర్ 563/1లోని 7 ఎకరాల భూ వివాదంపై ఎడ్ల సుధాకర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసింది. సిటీ సివిల్ కోర్టులో టైటిల్ వివాదం పెండింగ్‌లో ఉన్నందున ఉన్నత న్యాయస్థానం ఈ ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాలను పునః సమీక్షించాలని కోరుతూ హైడ్రా ఐఏ దాఖలు చేసింది. ఈ ఐఏపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. స్టేటస్‌కో ఆదేశాల ఎత్తివేతకు నిరాకరించింది.

శ్రీరామ శోభాయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇతర నాయకులు

షాద్‌నగర్: శ్రీరామ నవమిని పురస్కరించుకొని పట్టణంలో హిందూ వాహిని సంస్థ ఆధ్వర్యంలో వచ్చేనెల 6న శ్రీరామ శోభాయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ మేరకు యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం పట్టణంలోని శివమారుతీ దేవాలయం ఆవరణలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెబాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్ర నాయకుడు బండారి రమేష్ కలిసి ఆవిష్కరించారు. ఏప్రిల్ 6న సాయంత్రం 4గంటలకు పట్టణంలోని రైల్వే స్టేషన్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఫరూఖ్‌నగర్ వరకు శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విశ్వం, చెట్ల వెంకటేష్, రమేష్, శేఖర్, మఠం రాచయ్య, మురళి, హరిభూషణ్, క్యామ మహేశ్, శ్రీనివాస్‌చారి, కాసోజు శివకుమార్, శివశంకర్ పాల్గొన్నారు.

ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వలేం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి తేల్చిచెప్పిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాతపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వలేమని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి హైకోర్టు తేల్చిచెప్పింది. కేసు దర్యాప్తును నిలుపుదల చేయడంగానీ, అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 10కి వాయిదా వేశారు. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని సుజాతకు నోటీసులు జారీ చేశారు. అభివృద్ధి పనుల శంకుస్థాపనకు సంబంధించి నెలకొన్న వివాదంలో భాగంగా సుధీర్‌రెడ్డి తనను దూషించారని ఎల్బీనగర్ పీఎస్‌లో సుజాత ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు ఎమ్మెల్యేపై గత వారం ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. రాజకీయ కక్షతో తనపై తప్పుడు కేసు పెట్టారని, కేసును కొట్టివేయాలని కోరుతూ సుధీర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసులో అరెస్టు సహా తదుపరి విచారణ నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. తాను ఎవరినీ కించపరిచేలా వ్యాఖ్యలు చేయలేదని, కావాలనే ఎలాంటి ఆధారాలు లేకున్నా కేసు పెట్టారన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్‌కు ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వకూడదని, పిటిషన్‌ను కొట్టివేయాలని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. విచారణను నిలిపివేయలేమని తేల్చిచెబుతూ, విచారణ వాయిదా వేశారు.

బార్ ఓనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్ గౌడ్

పంజగుట్ట: మద్యం దుకాణాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న పర్మిట్ రూమ్‌లను తొలగించాలని, మద్యం విక్రయాల సమయాన్ని తగ్గించాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు జి.దామోదర్ గౌడ్ ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్ మాట్లాడుతూ .. వైన్‌షాపుల్లో పర్మిట్ రూంల వల్ల బార్ల వ్యాపారం నడవడంలేదన్నారు. నిబంధనల ప్రకారం 100 స్క్వేర్ మీటర్లలో ఎలాంటి కుర్చీలు, టేబుల్స్ లేకుండా, ఎలాంటి తినుబండారాలు విక్రయాలు లేకండా ఉండాల్సిన పర్మిట్ రూంల విషయంలో వైన్ షాపుల నిర్వాహకులు ఇవేవీ పాటించడం లేదన్నారు. బార్ల చుట్టుపక్కల బెల్ట్‌షాపులు ఉన్నాయని బెల్ట్‌షాపుల వల్ల బస్తీల్లో ప్రజలకు ఇబ్బందులు పడడమే కాకుండా తమ వ్యాపారానికి కూడా ఎంతో నష్టం వాటిల్లుతుందని, వెంటనే బెల్ట్ షాపులు లేకుండా చెయ్యాలని కోరారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో వైన్‌షాపులు ఉదయం 10 నుండి రాత్రి 10 వరకే ఉంటాయని, కేవలం జీహెచ్‌ఎంసీ పరిధిలో మాత్రమే ఉదయం 10 నుండి రాత్రి 11 వరకు కొనసాగుతున్నాయని, ఇక్కడ కూడా రాత్రి 10 గంటలకు వైన్‌షాపులు మూసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ సమస్యలపై ఇప్పటికే ఎక్సైజ్ శాఖామంత్రి, కమిషనర్‌కు వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు విజయ్ కుమార్ గౌడ్, రామకృష్ణ, శ్రీనివాస్ గుప్త, సంజీవరావ్, నరసింహ గౌడ్, వెంకన్న గౌడ్‌లు పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌ఓ, వైఎఫ్‌ఎల్ఓకు కొత్త సారథులు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వైఎఫ్ ఎల్ఓ) చైర్‌పర్సన్‌గా ప్రతిభ కుండ, యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వైఎఫ్ఎల్ఓ)కు పల్లవి జైన్‌లు నూతన సారథులుగా నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఫిక్కీ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించిన కీర్తిశేషులు పొట్టి శ్రీరాములు మనవరాలు ప్రతిభ కుండ అనీ, అంతేకాక ఆమె దేశపు మొట్టమొదటి పౌరాణిక థీమ్ పార్క్ సురేంద్రపురికి మేనేజింగ్ డైరెక్టర్, సియారా రిట్రీట్ ప్రధాన్ కన్వెన్షన్స్ వ్యవస్థాపకురాలు కూడా అని వివరించారు.

ఓపెన్‌టాప్ జీపులో ఎయిర్ రైఫిల్‌తో...

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–1లోని సర్వి హోటల్ సమీపంలో ఓపెన్‌టాప్ జీపులో వెళ్తూ ఎయిర్ రైఫిల్‌ను చూపిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన యువకుడితో పాటు డ్రైవర్‌ను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..సనత్‌నగర్‌కు చెందిన అఫీజుద్దీన్ వృత్తిరీత్యా వీడియోగ్రాఫర్. సోషల్ మీడియాలో రీల్స్ చేస్తుంటాడు. ఎయిర్ రైఫిల్‌ను ఉపయోగిస్తుంటాడు. అదే ఎయిర్‌రైఫిల్‌ను ఓపెన్ టాప్ జీపులో చేతితో తిప్పుతూ వెళ్తున్నట్లుగా చేసిన రీల్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. చట్టానికి విరుద్ధంగా రైఫిల్‌ను తిప్పుతూ స్థానికులకు భయభ్రాంతులకు గురిచేయడంపై అఫీజుద్దీన్‌తో పాటు డ్రైవర్ మహ్మద్ అంజా ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఈఎన్‌టీ ఆసుపత్రికి ఆధునిక పరికరాలు

సాక్షి, సిటీబ్యూరో: పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు తమవంతుగా సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఈడీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఐఓసీ, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సంయుక్తంగా శుక్రవారం కోఠిలోని ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రికి రూ.55 లక్షల విలువైన అత్యాధునిక యంత్ర పరికరాలు అందించారు. దీనికి సంబంధించి ఎంఓఏపై ఐఓసీ, హెచ్‌హెచ్‌ఎఫ్, ఈఎన్‌టీ సిబ్బంది సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడే పేదల ఆరోగ్య సంరక్షణా ప్రమాణాలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఖచ్చితమైన రోగ నిర్ధారణ, శస్త్ర చికిత్సలకు అనువైన బ్రెయిన్ స్టెమ్ ఎవోక్డ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ, ఎల్ఈఐసీఏ ఎం320 మైక్రోస్కోప్, పరికరాలు సమకూర్చారు.